క్లుప్తంగా

శాకంబరిగా ఎర్నిమాంబ

ఘనంగా అమ్మవారి మారువారం పండగ



కాయగూరల అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి మారువారం జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం వేకువజామున 5 గంటల నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ ప్రత్యేకంగా అమ్మవారికి అలంకరణ చేశారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ప్రసాదం వితరణ చేశారు. కార్యనిర్వహణాధికారి డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామి

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలతో సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల్లో భాగంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీతపై ప్రవచనాలు అందించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి వార్లను దర్శించుకున్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం బస్టాప్ వద్ద ఆదివారం చింతలపూడి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజికసేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకి పోలిరెడ్డి, శ్రీనుయాదవ్,ఉరుకూటి పైడిరాజుయాదవ్,ఆర్మీ శ్రీను పాల్గొన్నారు.

యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కి 143 మంది హాజరు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రంగా ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 277 మంది అభ్యర్థులకు 143 మంది హాజరయ్యారు. అభ్యర్థులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష హాల్‌లోకి పంపారు. అభ్యర్థులకు తగిన సౌకర్యాలు సమకూర్చారు.

పేద కళాకారులకు చేయూత

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఉన్న పేద కళాకారులు చేయూతను ఇవ్వనున్నట్లు కళాసాహితి సంస్థ అధ్యక్షులు పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ తెలిపారు. ఆదివారం జరిగిన కళాసాహితి సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన పలువురు కళాకారులు ఉన్నారన్నారు. గతంలో వారికి మంచి గుర్తింపు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాంటి వారికి తమవంతు సహకారం అందించేందుకు నిర్ణయించామని, త్వరలో వారిని ఎంపిక చేసి కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు.

రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు | విస్తరించినా ప్రయోజనం శూన్యం | ఇబ్బంది పడుతున్న వాహనదారులు | కన్నెత్తి చూడని అధికారులు

కొందరి స్వార్థం.. అందరికీ శాపం!



విస్తరించక ముందు ఇరుగ్గా మార్గం



లక్షల వ్యయంతో నిర్మించిన మార్గంలో ఆక్రమణలు



విశాలమైన మార్గంలో అడ్డంగా నిలిపిన వాహనాలు

మల్కాపురం: ప్రజా అవసరాల కోసం లక్షల వ్యయంతో ఇరుగ్గా ఉన్న మార్గాన్ని విశాలం చేశారు. నేడు కొందరి స్వార్థంతో ఆ విశాలమైన మార్గం మరలా ఇరుకుమయం అవుతోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

61వ వార్డు మల్కాపురం కృష్ణా రెస్టారెంట్ అండ్ బార్ వెనుక 30 అడుగుల వెడల్పుతో మార్గం ఉండేది. ఆ మార్గంలో ప్రకాష్‌నగర్,జనతాకాలనీ,టీడీపీ కాలనీ,అచ్చినాయుడులోవ ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వారితో పాటు మల్కాపురం ,గాంధీజీవీధి తదితర ప్రాంత వాసులు కూడా ఈ మార్గం ద్వారానే ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. 2014కు ముందే వాహనాల వినియోగం తక్కువగా ఉన్న సమయంలోనే ఈ మార్గం ఇరుగ్గా ఉండేది. ఇరువైపులా ఆటోలు,ట్రాక్టర్‌లు వంటివి పార్కింగ్ చేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యేవారు. అప్పుడు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ చొరవతో ఆ మార్గాన్ని 40 అడుగులుగా విస్తరించారు.అప్పట్లో సుమారు రూ.20 లక్షల వరకు జీవీఎంసీ నిధులు ఖర్చు చేశారు. దీంతో హాయిగా రాకపోకలు సాగించేవారు. అయితే ఈ ముచ్చట ఎంతో కాలం లేదు. మరలా కొందరు తమ వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కు చేయడం,రోడ్డుపై ఇసుక,పిక్క వంటివి డంప్ చేయడంతో రోడ్డు ఇరుగ్గా మారుతోంది. అధికారులు స్పందించి విశాలమైన మార్గంలో భవన నిర్మాణ సామగ్రి డంప్ చేయకుండా, ఫంక్షన్ల కోసం రోడ్డు పూర్తిగా మూసి వేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కొందరి వల్లే..



ఇక్కడ కొంత మంది రోడ్డుపైకి వచ్చారు. వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. భవన నిర్మాణ సామగ్రి వేసి రోజుల తరబడి వదిలేస్తున్నారు. అడిగితే వివాదాలకు దిగుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలపకుండా.. నిర్మాణ సామగ్రి వేయకుండా కట్టడి చేయాలి.

– ఖాన్, స్థానిక వాసి

వాహనం తప్పించుకోలేని పరిస్థితి



ఆక్రమణల వల్ల రోడ్డు విస్తరించక ముందు ఎలాంటి కష్టాలు ఉన్నాయో.. ప్రస్తుం అదే పరిస్థితి ఇక్కడ నెలకుంటుంది. లక్షల వ్యయంతో ఈ మార్గాన్ని విస్తరించినా ఫలితం లేదు.దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్ ఉంటుంది. నిర్మాన సామగ్రి వేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో వాహనాలు ఎదురైతే తప్పించుకోలేని పరిస్థితి. –నర్సింగ్‌రావు, వాహనదారు

ఉత్సాహంగా క్రీడాపోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి గాంధీగ్రామ్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బుక్స్ రీడింగ్, చెస్, క్యారమ్స్ వంటి ఆటపాటల్లో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి బి.కనకరాజు మాట్లాడుతూ వేసవిలో ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. గ్రంథపఠనం చేస్తే భవిష్యత్తులో మంచి విజ్ఞానవేత్తలుగా ఎదుగుతారన్నారు. అదే వారి జీవితాన్ని ఉన్నత దిశగా నడిపిస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, చాకెట్లు పంపిణీ చేశారు.

• బోరు మంటోంది



ఫోకస్

జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాష్ నగర్‌లో నీటి ఎద్దడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగు నీటి బోరు పనిచేయడం లేదు. పలు మార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బోరు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

-సింథియా

సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న టౌన్ అడ్మిన్ జీఎం చంద్రశేఖర్

ఉక్కునగరం: సత్యసాయి సంస్థల సేవలు నిరుపమానమని స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జీఎం చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఉక్కునగరం సత్యసాయి మందిరంలో 38వ సారి రక్తదాన శిబిరం నిర్వహించారు. అమ్మ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రక్తదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరం ద్వారా సేకరించిన 68 యూనిట్లు రక్తంలో అమ్మ బ్లడ్ బ్యాంక్‌కు 36 యూనిట్లు, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్‌కు 32 యూనిట్లు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా సమన్వయకర్త ఆర్.ఎ. నాయుడు, జేసీఐ ప్రతినిధులు రవికుమార్, సత్యసాయి ప్రతినిధులు ఎస్.కె.ఆర్.కె. రాజు, కె.వి. రమణ, వి. కృష్ణ, కె. ప్రకాశ్, ఎస్.ఎం. విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి గాయాలు, ఆస్పత్రిలో చికిత్స



కారు ఢీకొట్టంతో దెబ్బతిన్న ఆటో

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివి.. అగనంపూడికి చెందిన భాస్కర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం పలాసలో జరుగుతున్న గ్రామదేవత పండగకు బయలుదేరారు. ద్వారకా బస్ స్టేషన్‌కు చేరుకునేందుకు వీరంతా ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అగనంపూడి నుంచి ఆటోలో వస్తున్నారు. తాటిచెట్లపాలెం సమీపంలోకి వచ్చేసరికి రైల్వే న్యూకాలనీ రోడ్డు నుంచి వస్తున్న ఓ కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కారు ఢీకొనడంతో ఆటో దెబ్బతింది. ఆటో డ్రైవర్ కె.కాశీరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉమామహేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ దానబోయినపాలెం సీతారామాలయంలో ఆదివారం యూజు, దానబోయిపాలెం గ్రామ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని 85వ వార్డు నాయకుడు ఇల్లపు ప్రసాద్ ప్రారంభించారు. ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణుడు, ఒంగోలులోని రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామ్ రావ్ అత్తోట మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహించవద్దని సూచించారు. యూజ్ సంఘం వ్యవస్థాపకుడు కె.పరంథామయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూములను త్యాగం చేసిన ఉక్కు నిర్వాసితులపై అభిమానంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం డాక్టర్లు కొప్పోలు ప్రణతి, వి.సిద్ధార్థ, జి.సంధ్య, సురేష్ పి, సురేష్, బి.లీలాబాయి, వి.ప్రమీల, వి.గోపికృష్ణ, పద్మజ, కె.లలిత తదితరులు సేవలందించారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ఇల్లపు ప్రసాద్ తదితరులు శిబిరం ఏర్పాటు చేసిన పరంథామయ్యను సత్కరించారు.

కొనసాగిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఆరో రోజు ఆదివారం కూడా కొనసాగింది. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్న డిమాండ్లతో ఈనెల 20 నుంచి కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మెకు దిగాయి. కార్మిక సంఘాల ప్రతినిధులు కార్మికుల నివాసాలకు వెళ్లి సమ్మెకు సహకరించాలని కోరుతున్నారు.

భావాలను వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ



చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులతో అతిథులు

మల్కాపురం: భాషా భేదాలతో పని లేకుండా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించే సాధనమే చిత్రలేఖనం అని ప్రముఖ చిత్రకారుడు ద్వారపూడి శ్రీనివాస మనోహర్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మన చరిత్ర,సంస్కృతిలో చిత్రకళకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రంగులను ఎంచుకోవడంలో, ప్రకృతి దృశ్యాలను చిత్రీకరించడంలోచిత్రకారుడి ప్రతిభ దాగి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. దీనిలో ప్రతిభ చూపిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం వలంటీర్లు సునీత,జ్యోతిర్మయి,గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ ఆలయ వార్షికోత్సవం



భూలోకమాంబను దర్శించుకుంటున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు యాతపాలెంలో కొలువైన భూలోకమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు ధర్మాల శ్రీను, పితాని అన్నవరం, సంపంగి అప్పలనాయుడు, సంపంగి ఈశ్వరరావు దర్శించుకున్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ భారత్



రైల్వే స్టేషన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం – 4లో స్వచ్ఛ భారత్, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాల్లో ప్రయాణికులకు పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. దువ్వాడ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.జాషువా, బి.కామేశ్వరరావు, ఆర్.రవి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, కె.వీ.సుబ్బరాజు, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాశ వేదిక, మానవతా, సాయి సేవా సమితి నుంచి సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న 250 మందికి మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు.

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలి



టిడ్కో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోట, దయాల్‌నగర్, బర్మా కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బర్మా కాలనీలో టిడ్కో లబ్ధిదారులతో కలసి ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడ్కో గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కనీస సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను కల్పించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆనంద్, అప్పలరాజు, భాస్కరరావు, ఖాన్, వెంకటరావు, బాషా, నాని, ధనలక్ష్మి, వైదేహి, జగదీష్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

గాజువాక: ఆత్మ రక్షణతోపాటు ఆత్మ విశ్వాసం పెంపొందడానికి కరాటే దోహదం చేస్తుందని 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు అన్నారు. టైగర్ పవర్ కరాటే కిక్ బాక్సింగ్ అండ్ బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్, కరాటే వంటి క్రీడలవల్ల శరీర దారుఢ్యంతోపాటు మానసికంగా బాగా అభివృద్ధి చెందుతారన్నారు.విద్యార్థి దశ నుంచే సాధన చేస్తే మంచి ప్రావీణ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గంటా నూకరాజు, కోచ్‌లు కరణం సన్నీ, ఆనంద్, వెంకట్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తులు, కుటుంబ విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ గ్రూప్‌గా ఎవరికి ఏ కష్టమొచ్చినా.. సహకరిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల చదువులు వదిలి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి, సందడిగా గడిపారు. ఫొటోలు తీసుకుని, జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

ఆకట్టుకున్న ‘అష్టలక్ష్మీ వైభవం’



కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇందులో అష్టలక్ష్మీ వైభవం కూచిపూడి నృత్యాంశం పధ్రాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇంకా.. తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య విరచిత ముద్దుగారే యశోదా.., గరుడ గమన, నారాయణతే నమో నమో తదితర కీర్తనలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చంద్ర చూడ.., అయిగిరినందిని.., స్వాగతం కృష్ణా.., దీపా తారంగిని.., శంభో శంకర తదితర గీతాలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. గీతా మిత్ర నృత్య దర్శకత్వంలో కళాకారులు పవిత్ర, మోక్షజ్ఞ, లక్ష్మీ ప్రణతి, జాస్మిక వీటిని ప్రదర్శించారు.

బీచ్‌లో మెరైన్ ఎస్‌ఐ పర్యటన



పర్యాటకులతో మాట్లాడుతున్న మెరైన్ ఎస్ఐ మురళీకృష్ణ

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌ను ఆదివారం ఉదయం మెరైన్ పోలీసులు సందర్శించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నగరానికి రానున్న నేపథ్యంలో బీచ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించినట్లు మెరైన్ ఎస్సై మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మురళీకృష్ణ పర్యాటకులు, మత్స్యకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. భద్రత దృష్ట్యా ప్రతిరోజు ఎంతమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శిస్తున్నారు, మత్స్యకారుల పూర్తి వివరాలను సేకరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో పాటు, బీచ్ పరిసరాల్లో స్థానికేతరుల వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు ఎవరైనా తీర ప్రాంతాల్లో సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.